పోరాటయోధుడు ఛత్రపతి శివాజీ

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లోని ఆయా గ్రామాల్లో ఆదివారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పలు సంఘాల ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటాలకు, విగ్రహాలకు ప్రజా ప్రతినిధులు, ప్రజలు పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ ఓ పోరాటయోధుడని, యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. స్వతంత్ర మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి, మధ్య యుగంలో హిందు మతధర్మాన్ని పరిరక్షించిన ఘనత శివాజీకే దక్కుతుందని అన్నారు. శివాజీ జయంతిని పురస్కరించుకొని పలుచోట్ల బైక్‌ర్యాలీ, రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


షాద్‌నగర్: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు


షాద్‌నగర్: రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి శంకర్‌రావు


షాద్‌నగర్‌రూరల్: వెలిజర్లలో నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు


మొయినాబాద్ రూరల్ : కేతిరెడ్డిపల్లి చౌరస్తాలో..


మొయినాబాద్ రూరల్ : కనకమామిడిలో..


కొత్తూరు : ర్యాలీని ప్రారంభిస్తున్న నాయకులు


నందిగామ: శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు, యువకులు


చేవెళ్ల: శివాజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, విశ్వేశ్వర్‌రెడ్డి


చేవెళ్ల: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, తదితరులు


షాబాద్ : ర్యాలీ తీస్తున్న నేతలు


షాబాద్: మండలం సర్దార్‌నగర్‌లో..

క్లుప్తంగా

క్రీడాపోటీలతో స్నేహభావం

బీజేపీ నాయకుడు కిరణ్‌కుమార్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వెంకటేష్ తదితరులు

షాబాద్: గ్రామీణ క్రీడాకారులకు క్రీడాపోటీలు ఎంతో దోహదపడుతాయని ఆటల పోటీలతో స్నేహభావం పెంపొందుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కుర్వగూడ గ్రామంలో ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా మండలస్థాయి వాలీబాల్ పోటీలను ఛత్రపతి శివాజీ అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు. క్రీడలు నిజజీవితంలో భాగం చేసుకుంటే శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంధ్యారాణి, ఎంపీటీసీ వనిత, యువజన సంఘం నాయకులు మహేష్, హరీష్, శంకర్, రఘు, నాగేష్, భాస్కర్, శ్రీహరి, వెంకటేష్ తదితరులున్నారు.

ఘనంగా బండమీది జాతర


ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీపీ ప్రియాంక

నందిగామ: ప్రతి ఒక్కరు దైవచింతన అలవర్చుకోవాలని ఎంపీపీ ప్రియాంక అన్నారు. మండల పరిధిలోని వెంకమ్మ గూడలో ప్రారంభమైన భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఉత్సవాల్లో భాగంగా ఆమె ఆదివారం దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ.. ప్రతి ఏటా బండమీది జాతరగా పిలవబడే ఈ ఉత్సవాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. వెంకమ్మగూడ పరిసర గ్రామాలతో పాటు షాబాద్ మండలంలోని పలు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరవుతారని తెలిపారు. ఇక్కడ మొక్కుకున్న మొక్కులు తీరుతాయనే భక్తుల్లో ప్రగాఢ నమ్మకం ఉందని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివ శంకర్‌గౌడ్, సర్పంచ్ రజనీత, గ్రామస్తులు వీరేందర్‌గౌడ్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం


కల్యాణోత్సవంలో పాల్గొన్న పీసీసీ సభ్యుడు సిద్ధేశ్వర్ తదితరులు

మొయినాబాద్: మండల పరిధిలోని పెద్దమంగళారంలో శివపార్వతుల కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయంలో అంగరంగ వైభవంగా కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణోత్సవాన్ని కన్నులారా తిలకించారు. కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గం పీసీసీ సభ్యుడు రాచమల్ల సిద్ధేశ్వర్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, నాయకులు అనంత రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాఘవరెడ్డి, చంద్రారెడ్డి, రమేష్, మహిపాల్‌రెడ్డి, కుమార్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీ ప్రభాకర్‌ను కలిసిన నాయకులు



చేవెళ్ల: చేవెళ్ల ఏసీపీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రభాకర్‌ను పలువురు నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. చేవెళ్ల ఏసీపీ కార్యాలయంలో ఆయనను సర్పంచ్ బండారి శైలజ, పీఏసీఎస్ చైర్మన్ డి. వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు వసంతం, రాములు, ఉప సర్పంచ్ గంగి యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు మల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డిలు కలిసి శాలువాలతో సన్మానించారు. అనంతరం చేవెళ్ల సీపీఐ నాయకులు కూడా వెళ్లి ఆయను కలిసి సన్మానించారు. సీపీఐ నాయకులు కె. రామస్వామి, సత్తిరెడ్డి, సత్యనారాయణ, సుధాకర్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, బల్వంత్‌రెడ్డి, నర్సింహులు, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే సాయన్న మృతికి సంతాపం

షాద్‌నగర్: కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న ఆదివారం ఆకస్మిక మరణం చాలా బాధాకరమని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సాయన్న మృతి చెందడం దురదృష్టకరమని చెప్పారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తన ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలిపారు.

దాతల సహకారం అభినందనీయం


విరాళం అందజేస్తున్న మల్లేశ్

చేవెళ్ల: ఆలయ అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదని ఆలయ పూజారి శ్రీకాంత్ అన్నారు. మండలకేంద్రంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయ అభివృద్ధికి ఆదివారం మల్లారెడ్డిగూడ అనుబంధ గ్రామమైన ఎర్రోని కొటాల గ్రామానికి చెందిన మూడిమ్యాల పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎర్ర మల్లేశ్ రూ.50వేల విరాళాన్ని పూజారి శ్రీకాంత్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలకేంద్రంలోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం ఎంతో పురాతనమైనదని ఇక్కడ భక్తుల కోరికలు తీర్చే రెండవ తిరుపతిగా ప్రసిద్ధి చెందిందన్నారు. భక్తులు, దాతలు అందించే సహాయ సహకారంతో ఆలయాన్ని దినాదినాభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. దేవాలయాలు ప్రజల మానసిక ప్రశాంతతకు, ఒత్తిడిని దూరం చేసేందుకు ఎంతో దోహదం చేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ప్రజలు తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలి

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కేశంపేట: ప్రజలు దైవభక్తి కలిగి ఉండాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సూచించారు. మండల పరిధిలోని అల్వాల గ్రామంలోని రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. బండలాగుడు పోటీల్లో గ్రామానికి చెందిన రవీందర్ ఎద్దులు మొదటి స్థానంలో నిలిచాయి. ప్రథమ బహుమతిగా రూ.6116 అందజేశారు. ద్వితీయ స్థానంలో అంజయ్య ఎద్దులు నిలువగా రూ.5116, తృతీయ స్థానంలో లక్ష్మయ్య ఎద్దులు నిల్వగా రూ.4116లను నిర్వాహకులు అందజేశారు. ట్రాక్టర్ రివర్స్ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి నగదు బహుమతులను అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గండ్ర జగదీశ్వర్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, శ్రీశైలం, అల్వాల శ్రీను, ధన్‌రాజ్‌రెడ్డి, యాదగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు శివపార్వతుల కల్యాణం

కేశంపేట: మండల పరిధిలోని కాకునూర్ గ్రామ శివారులోని మహాలింగేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు(సోమవారం) పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ అధ్యక్షుడు గండ్ర రమేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ గండ్ర జగదీశ్వర్‌గౌడ్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శివపార్వతుల కల్యాణం మధ్యాహ్నం 12గంటలకు దేవాలయ ప్రాంగణంలో జరుగుతుందన్నారు. కల్యాణోత్సవానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు, ప్రజలు అధిక సంఖ్యాలో పాల్గొనాలని వారు కోరారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారని చెప్పారు. బ్రహ్మోత్సవాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లను పూర్తి చేసినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.


మహాలింగేశ్వరస్వామి దేవాలయం

భక్తిశ్రద్ధలతో శివరాత్రి ఉత్సవాలు

- ఆలయంలో ప్రత్యేక పూజా సేవలు
- శేషవాహన సేవపై స్వామివారి ఊరేగింపు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయం


శివరాత్రి ఉత్సవాల్లో శేషవాహన సేవపై ఊరేగుతున్న స్వామివారు

చేవెళ్ల: చేవెళ్లలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైయ్యాయి. ఆదివారం ఆలయంలో పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని శేషవాహన సేవపై ఊరేగించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు, హారతులు కొనసాగాయి. ఆలయంలో వెలిసిన వివిధ దుకాణాలు, తినుబండారాలు, పిల్లలు ఆడుకునేందుకు రంగుల రాట్నాలు అందరి అలరిస్తున్నాయి. రంగురంగుల లైట్ల వెలుగులతో జాతర ఏర్పాట్లు కనువిందు చేస్తున్నాయి. జాతర ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు ఆలయం పక్కనే ఉన్న పుష్కరిణీ వద్ద స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకుంటున్నారు. జాతరకు వచ్చే భక్తులకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రజలకు, దుకాణాదారులకు తాగునీటి వసతి, గుడారాలు వేసుకునేందుకు స్థలాలను కేటాయించారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. జాతరలో ప్రత్యేకంగా భక్తుల కోసం వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రారంభించారు. జాతరకు వచ్చే భక్తులకు కావాల్సిన వైద్యసేవలను అందించాలని సూచించారు. ఉత్సవాల్లో భాగంగా వేంకటేశ్వర స్వామిని టీవీ సీరియల్ నటీనటులు జాకీ, హరిత దంపతులు దర్శించుకున్నారు. ఆలయ పూజారులు వారికి ప్రత్యేక పూజలు చేశారు.

సేవా కార్యక్రమాలతో గుర్తింపు

ప్రతి ఒక్కరు తోచిన విధంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని, దీంతో తగిన గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలకేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న శివరాత్రి జాతర ఉత్సవాల్లో ఆదివారం దాతలు కుంచం పెంటయ్య, అతని కుమారులు శివకుమార్, శ్రావణ్‌కుమార్, నరేశ్‌లు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులకు అన్నదానం చేయడం ఎంతో మంచి కార్యక్రమం అని చెప్పారు. ప్రతి ఏడాది జరిగే జాతరలో భక్తులకు అన్నదానం చేసేందుకు పెంటయ్య వస్తున్నారని అన్నారు. చేవెళ్లలో శివరాత్రికి జరిగే జాతర ఉత్సవాలకు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు పాటు ఇతర దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అన్నదానం చేయడంతో వారి ఆకలి తీరుతుందన్నారు. కార్యక్రమంలో కుంచం శివకుమార్, శ్రావణ్, నరేశ్, చేవెళ్ల ఎంపీపీ విజయలక్ష్మి, సర్పంచ్ శైలజ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, ప్రభాకర్, క్రిష్టారెడ్డి, మాణిక్యరెడ్డి, పాల్గొన్నారు.


అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

క్రీడలు శారీరక దృఢత్వానికి దోహదం

బీజేపీ నేత శ్రీవర్ధన్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

కొందుర్గు: క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంచుతాయని బీజేపీ నేత శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా కొందుర్గు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 9వ రాష్ట్రస్థాయి ఓపెన్ టూ ఆల్ కబడ్డీ టోర్నమెంట్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. అంతకుముందు ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందుర్గు ప్రాంతంలో యువత క్రీడలపై ఎంతో ఆసక్తి చూపుతుందన్నారు. ఇందుకు యువతను అభినందిస్తున్నామని తెలిపారు. క్రీడాకారులు గెలుపోటములను సర్వ సాధారణంగా స్వీకరించాలని, ఓటమి గెలుపునకు నాందిగా భావించాలని సూచించారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, నాయకులు శ్రీశైలం, మనోహర్ రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, యాదయ్య, నరేందర్, రాములుగౌడ్, కురుమయ్య పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

షాద్‌నగర్: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని సర్పంచ్ లక్ష్మి అన్నారు. మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామంలో ఆదివారం వాలీబాల్ టోర్నమెంట్ గ్రామ పెద్దల ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని అన్నారు. క్రీడాకారులు తమలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలన్నారు. యువతకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని తెలిపారు. యువత మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులు ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, నర్సింలు, మాధవరెడ్డి, మోహన్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రవీందర్, శంకర్, సత్యం, ప్రసాద్, రాజశేఖర్, చందు, రమేష్, శ్రీకాంత్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

తారకరత్నకు ఘన నివాళి

షాద్‌నగర్‌టౌన్: సినీ నటుడు తారకరత్న అకాల మరణంతో ఆదివారం పట్టణ చౌరస్తాలో టీడీపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... తారకరత్న మరణం సినిమా, రాజకీయ రంగానికి తీరని లోటని అన్నారు. అందరితో కలుపుగోలుగా ఉంటే తారకరత్న మృత్యువుతో పోరాటం చేసి మరణించడం బాధాకరమని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని తెలిపారు. నివాళులర్పించిన వారిలో నాయకులు కర్నకోట రమేష్, గంధం ఆనంద్, అంజయ్యగౌడ్, రాజు, రామకృష్ణ, నాగులపల్లి అనంతయ్య, శంకరయ్య, కృష్ణయ్య, నర్సింలు, తదితరులు ఉన్నారు.

అన్నదానం మహాదానం

మాజీ ఉప సర్పంచ్ రవీందర్


అన్నదానం చేస్తున్న రవీందర్ ముదిరాజ్

నందిగామ: అన్నదానం అన్ని దానాల్లో కన్నా గొప్పదని నర్సప్పగూడ మాజీ ఉప సర్పంచ్ నీరటి రవీందర్ ముదిరాజ్ అన్నారు. మండల పరిధిలోని నర్సప్పగూడ శివారులోని వెంకటగిరి కొండపై శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆయన సొంత ఖర్చులతో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులకు అన్నదానం చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. వెంకటగిరి కొండపైకి వాహనాలు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో ఇటీవల రూ.3 లక్షల 50 వేల సొంత డబ్బుతో రోడ్డును వేయించానని, ఆలయాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అశోక్, ఉప సర్పంచ్ శేఖర్, మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు కొడిచర్ల యాదయ్య, మల్లికార్జున గౌరై కాపారుల సహకార సంఘం అధ్యక్షుడు కాట్న సురేందర్, గ్రామస్తులు లక్ష్మయ్యగౌడ్, గోవిందు ఆంజనేయులు, నీరటి చందన్, మెండే కృష్ణ, నీరటి సురేందర్, యాదగిరి, బంటారం సుదర్శన్ గౌడ్, నీరటి సిద్దు, కాట్న శ్రీనివాస్, జెగ్గ శేఖర్, కాట్న బాల్‌రాజ్, జంగిలి శేఖర్, వడ్ల అరవింద్, చాకలి అశోక్, నక్కల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నూతన రేషన్ దుకాణం ప్రారంభం

నందిగామ: నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ షాపును గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఈదులపల్లి సర్పంచ్ స్వామి అన్నారు. మండల పరిధిలోని మోత్కులగూడలో ఆదివారం నూతన రేషన్ దుకాణాన్ని సర్పంచ్ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఈదులపల్లికి అనుబంధ గ్రామంగా ఉన్న మోత్కులగూడ గ్రామస్తులకు రేషన్ షాపు లేక సుమారు 2.5 కిలో మీటర్లు నడిచి ఈదులపల్లికి వెళ్లి రేషన్ సరుకులను తెచ్చుకునే వారని అన్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఎమ్మెల్యే మోత్కులగూడలో రేషన్ షాపును ఏర్పాటు చేయించారు. ఇప్పటి నుంచి మోత్కులగూడ గ్రామస్తులు తమ గ్రామంలోనే రేషన్ సరుకులు తీసుకోవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహులు గౌడ్, రమేష్, నర్సింహా గ్రామస్తులు పాల్గొన్నారు.


రేషన్ షాపును ప్రారంభిస్తున్న సర్పంచ్ స్వామి

షర్మిలమ్మ అరెస్టు అప్రజాస్వామికం

వైఎస్ఆర్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇబ్రహీం



షాద్‌నగర్: ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు పాదయాత్ర చేస్తున్న వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఆ పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ మహ్మద్ ఇబ్రహీం అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరికి స్వేచ్ఛ ఉంటుందన్నారు. మహబూబాబాద్ జిల్లాలో వైఎస్ షర్మిల చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్ర అనుమతిని పోలీసులు రద్దు చేయడం సరికాదన్నారు. శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న షర్మిలను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాదయాత్ర చేయకుండా మరోసారి కుట్రకు తెరలేపిందని ఆరోపించారు. ప్రజల తరఫున ప్రశ్నిస్తుందని పాదయాత్రపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందన్నారు. రాష్ట్రంలో రాచరిక పాలన నడుస్తోందని, ఈ పాలనను అంతమొందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మండిపడ్డారు. రాజన్న ఆశయాల సాధన కోసం షర్మిల ఎంతో కృషి చేస్తుందని, రాజన్నరాజ్యంతోనే తెలంగాణలో అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు షర్మిలకు అండగా ఉన్నారని వివరించారు.